## క్లుప్తంగా

### ప్రజలకు అందుబాటులో ఉండాలి



మోపాల్: ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో రాములు నాయక్ సూచించారు. మండలంలోని మంచిప్ప గ్రామపంచాయతీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించి, పారిశుద్య పనుల గురించి పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే స్పందించి, పరిష్కరించాలని సూచించారు. జూనియర్ అసిస్టెంట్ భోజన్న, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



సుభాష్‌నగర్: తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని మంగళవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం సందర్భంగా శ్రీవారి కల్యాణం జరిపించి, వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేంకటేశ్వర స్వామి వారి ఆశీర్వాదంతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి, పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ధన్‌పాల్ వినయ్ దంపతులు ఉన్నారు.

### ఎరువుల కొరత లేకుండా చూడాలి



ధర్పల్లి: వానాకాలం పంటలకి కావలసిన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలని సొసైటీ అధికారులను తహసీల్దార్ శాంత, ఏవో వెంకటేష్ ఆదేశించారు. ధర్పల్లి, హొన్నాజిపేట్ సొసైటీల్లో ఎరువుల నిల్వలను వారు మంగళవారం తనిఖీ చేశారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు కావలసిన ఎరువులు ఎంత అవసరం పడతాయి. సొసైటీలో ఎంత స్టాక్ ఉంది అనే వివరాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

### నిధులను ఇవ్వండి



డిచ్‌పల్లి: మండలంలోని సుద్దులం గ్రామాభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని వీడీసీ సభ్యులు కోరారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మంగళవారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదనపు గదులు, పోచమ్మ ఆలయం వద్ద బోరు మోటారు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వీడీసీ అధ్యక్షుడు సాయరెడ్డి తెలిపారు. నాయకులు సురేందర్, లక్ష్మణ్, వెంకటేష్, వీడీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

### 'పహల్గాం' ఘటనపై సమగ్ర విచారణ జరపాలి



సిరికొండ: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన మారణకాండపై సమగ్ర విచారణ చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో దాగిన నిజాలను కేంద్ర ప్రభుత్వం బహిరంగపర్చాలని కోరారు. నాయకులు బాలయ్య, శంకర్, కారల్‌మార్క్స్, సంజీవ్, గంగాధర్ ఉన్నారు.

### రికవరీ సెల్‌ఫోన్ల అందజేత

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల పోగొట్టుకున్న 9 సెల్‌ఫోన్లను సీఐ వెంకట నారాయణ యజమానులకు మంగళవారం అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి సెల్ ఫోన్ యజమానులకు అందించామని సీఐ తెలిపారు.

# శరవేగంగా దరఖాస్తుల పరిశీలన

- బల్దియాలో రాజీవ్ యువ వికాసం పథకానికి 3,811 దరఖాస్తులు
- అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్న మున్సిపల్ అధికారులు
- నెలాఖరు వరకు పూర్తికానున్న ప్రక్రియ



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రవేశపెట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. గతంలో ఆసక్తిగల నిరుద్యోగులు, యువత దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందించగా, వారి వివరాలతో కూడిన జాబితాను బల్దియా అధికారులు సిద్ధం చేశారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన శరవేగంగా కొనసాగుతుండగా నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తికానున్నట్లు అధికారులు తెలిపారు.

**సిబిల్, పాన్ వివరాలే ముఖ్యం..**

రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ధ్రువీకరించేందుకు సిబ్బంది క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేస్తున్నారు. ఇందులోంచి 3,811 మందిని గుర్తించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు 588 మంది, బీసీ కార్పొరేషన్‌కు 1360 మంది, ఈబీసీ కార్పొరేషన్‌కు 518, ఎస్టీ కార్పొరేషన్‌కు 152 దరఖాస్తులను గుర్తించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో మంచి సిబిల్ స్కోర్ ఉన్నవారినే ఎంపిక చేస్తున్నారు. కనీసం 650 సిబిల్ స్కోర్ ఉండాలి. అంతకు తక్కువగా ఉన్న వారి దరఖాస్తులు పక్కన పెడుతున్నారు. కొందరు దరఖాస్తు ఫారమ్‌లో పాన్ నెంబర్‌ను ఇవ్వలేదు. దీంతో దరఖాస్తుదారులకు ఫోన్‌లు చేసి వారి పాన్ నెంబర్‌లు సైతం సేకరిస్తున్నారు. సిబిల్ స్కోర్ తగినంతగా ఉండి, పాన్ నెంబర్ సరిగ్గా ఉన్నవారి జాబితా సిద్ధం చేస్తున్నారు.క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేశారు. వీరి వివరాలను బ్యాంక్ అధికారులకు పంపారు.

**త్వరలో ప్రొసీడింగ్స్..**

రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల సేకరణ, బ్యాంక్ అధికారుల నుంచి అంగీకారం మొత్తం ఈ నెలాఖరులోపు పూర్తికానుంది. అనంతరం అర్హులందరికి రాష్ట్ర అవతరణ రోజున రుణాలు మంజూరు చేయనున్నట్లు సమాచారం. లబ్ధిదారులకు రుణాల మంజూరుకు సంబంధించి కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నట్లు తెలిసింది.

**బ్యాంక్ అధికారులకు పంపాం..**



రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరు తమ పూర్తి వివరాలు నమోదు చేయలేదు. దాంతో వారి వివరాలు సేకరించేందుకు చాలా సమయం పడుతోంది. కొందరు బ్యాంక్ వివరాలు, పాన్ నెంబర్ ఇవ్వలేదు. ప్రస్తుతం బ్యాంక్ అధికారులకు జాబితా పంపాం. వారు దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ చెక్‌చేసే పనిలో ఉన్నారు. ఈ నెలాఖరులోగా అర్హుల జాబితా సిద్ధం కానుంది.

–పడాల గోవర్ధన్ గౌడ్, యువ వికాసం ఇన్‌చార్జి (మున్సిపల్ కార్పొరేషన్)

## నగరంలో నేటి నుంచి కాంగ్రెస్ సమావేశాలు

నిజామాబాద్ సిటీ: నగరంలో నేటినుంచి మూడు రోజులపాటు కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఈనెల 28 నుంచి 30వరకు డివిజన్ల వారీగా సమావేశాలు జరుగుతాయన్నారు. పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సూచనల మేరకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌లలో నాయకత్వం వహించేవారు, మాజీలు, తాజా మాజీలు తమ వివరాలు అందజేయాలని సూచించారు. ప్రతీ డివిజన్ నుంచి 15 మంది వరకు పాల్గొనవచ్చని తెలిపారు. బుధవారం కంఠేశ్వర్ హౌజింగ్‌బోర్డు కాలనీలో 19, 20, 21, 35, 36, 41, 42, 43 డివిజన్ల సమావేశాలు నిర్వహిస్తామన్నారు. 29న గురువారం కోటగల్లిలోని గోనెరెడ్డి కల్యాణ మండపంలో 6, 7, 8, 22, 23, 24, 25, 26, 28, 45, 50 డివిజన్ల సమావేశాలు, కాంగ్రెస్ భవన్‌లో 29, 33, 34, 51, 53, 55, 56, 57, 58, 59, 60 డివిజన్ స్థాయి సమావేశాలు జరుగుతాయన్నారు. 30న శుక్రవారం బొబ్బిలివీధిలోని మున్నూరుకాపు సంఘంలో 44, 46, 47, 48, 49 డివిజన్లు, గౌతంనగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో 16, 17, 37, 38, 39, 40 డివిజన్ల సమావేశాలు నిర్వహిస్తున్న కేశ వేణు తెలిపారు.

**మోపాల్ మండలంలో..**

మోపాల్: కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బుధవారం మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేటి ఉదయం నగర శివారులోని అమృతాగార్డెన్స్‌లో డిచ్‌పల్లి, మోపాల్, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ రూరల్, సాయంత్రం 4గంటలకు ధర్పల్లిలోని పాత గురడికాపు సంఘంలో ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశాలకు పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సహ పరిశీలకులు, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నక తిరుపతి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్స్, డీసీసీబీ, పీఏసీఎస్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు, డీసీసీ డెలిగేట్స్, పార్టీ అన్ని విభాగాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ అధ్యక్షులు, పార్టీ అన్ని విభాగాల నాయకులు తప్పకుండా హాజరై సమావేశాలను విజయవంతం చేయాలని రూరల్ ఎమ్మెల్యే కోరారు.

## యూరియా వినియోగం తగ్గించాలి



మెండోరాలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త మంజు భార్గవి

మోర్తాడ్: పంటల సాగులో యూరియా వినియోగం తగ్గిస్తేనే మేలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మంజు భార్గవి చెప్పారు. రసాయనాల వాడకం తగ్గించడం వల్ల పెట్టుబడి తగ్గిపోవడంతో పాటు భూసారానికి నష్టం జరుగదని, నాణ్యమైన పంటలు చేతికి అందుతాయని తెలిపారు. మంగళవారం భీమ్‌గల్ మండలం మెండోరాలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఏవో లావణ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

**సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి**

రుద్రూర్: రసాయన మందులను విచక్షణారహితంగా పిచికారీ చేయకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త ఎం. సాయి చరణ్ సూచించారు. పొతంగల్ మండలం కల్లూర్‌లో మంగళవారం ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల సందేహాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. అధిక దిగుబడులు సాధించడానికి సలహాలు, సూచనలిచ్చారు. ఏవో నిషిత మాట్లాడుతూ.. తప్పనిసరిగా వేసవి దుక్కులు దున్నుకోవాలని సూచించారు. వెటర్నరీ అండ్ లైవ్ స్టాక్ ఆఫీసర్ నారాయణ, ఏఈవో సుప్రియ, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కల్లూర్‌లో.. కీటక శాస్త్రవేత్త సాయి చరణ్

**క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలి**

వేల్పూర్: రైతులు తమ పంటల భూమిలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా కమిటీ సభ్యుడు కోటపాటి నర్సింహనాయుడు పేర్కొన్నారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో మంగళవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రుద్రూర్ కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు ఆకుల దినేష్, డాక్టర్ శ్రీలత, ఏవో శృతి పంటల సాగుపై అవగాహన కల్పించారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి వివరించారు.

## అవసరమున్న చోట కల్వర్టులు నిర్మించండి

- అపరిశుభ్రతకు చోటివ్వకండి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): వర్షపు నీరు నిల్వ ఉండకుండా పట్టణంలోని శర్బతీ కెనాల్‌పై అవసరమున్న చోట కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని బల్దియా అధికారులకు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని శర్బతీ కెనాల్ కాలనీ, రాకాసిపేట్, తట్టికోట్ కాలనీలో కాలువను, అనంతరం తట్టికోట్‌లో నూతనంగా నిర్మించిన కల్వర్టును పరిశీలించారు. వర్షా కాలంలో పట్టణంలో పలు చోట్ల కాలువలు పొంగిపొర్లడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని, భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుద్య సమస్యలు రాకుండా మురికి కాలువలు శుభ్రం చేయాలని, మురికి కాలువలు లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. బల్దియా కమిషనర్ వెంకట నారాయణ, డీఈ యోగేష్, ఏఈ శ్రీనివాస్, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ తదితరులున్నారు.

### ఘనంగా యోగా దినోత్సవం



నిజామాబాద్ రూరల్: మండలంలోని తిర్మన్‌పల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ అఖిల్ అలీ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారితో యోగాసనాలు, మెడిటేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఏఎన్‌ఎంలు ప్రకాశిని, శివలీల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### రుణాలను సకాలంలో చెల్లించాలి



నిజామాబాద్ రూరల్: స్త్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించాలని స్త్రీనిధి రీజనల్ మేనేజర్ రాందాస్ అన్నారు. పాంగ్రాలోని సమాఖ్య భవనంలో మంగళవారం రూరల్ మండల సమాఖ్య సమావేశం అధ్యక్షురాలు రెడ్డి సునీత అధ్యక్షతన నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ.. అక్షయ, ప్రతిభ, సౌభాగ్య లోన్ల గురించి చర్చ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ.. అక్షరలక్ష్మి పథకం కింద మహిళా సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలకు, పదో తరగతి పూర్తిచేయని వారికి ఓపెన్ ఎస్సెస్సీ పరీక్ష రాయించి అక్షరాస్యత పెంచే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాల మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆవరణలో మంగళవారం తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ సంబురాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా బాధ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకపాత్ర పోషించిన టీజేఎఫ్ 25 వసంతాలు పూర్తిచేసుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. 31న జలవిహార్‌లో నిర్వహించనున్న రజతోత్సవాలకు నిజామాబాద్ జిల్లా నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. టీయూడబ్ల్యూజే ప్రతినిధులు సాయి ప్రసాద్, పంచరెడ్డి శ్రీకాంత్, బాలకుమార్, దివాకర్, ఆంజనేయులు, భానుతేజ, అజ్మత్, సాయి కులకర్ణి, అరుణ్ గౌడ్, సురేష్, సితార కృష్ణ, రాజేష్, మోహన్, శ్రీనివాస్, కష్ణ, పులగం శ్రీకాంత్ పాల్గొన్నారు.

### రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గంలోని పొతంగల్ మండలానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కూల్‌ను పోతంగల్ మండలం పీఎస్ఆర్‌నగర్(సోంపూర్ శివారులో) నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

### నిబంధనలు పాటించాలి

రెంజల్(బోధన్): బక్రీద్ సందర్భంగా వ్యాపారులు పశువులను వాహనాల్లో తరలించే సమయంలో నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. సాటాపూర్‌లో మంగళవారం రెవెన్యూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో వ్యాపారులు, మతపెద్దలు, పంచాయతీ కార్యదర్శులతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్ మాట్లాడుతూ..పశువులను పరిమితికి మించి వాహనాల్లో తరలించవద్దన్నారు. పశువులను కొన్న వ్యాపారులు తప్పనిసరిగా పంచాయతీ కార్యాలయం నుండి రసీదు తీసుకోవాలన్నారు.

## కాలనీలోని సమస్యలను పరిష్కరించాలి

- నగర మున్సిపల్ కమిషనర్‌కు అమ్మనగర్ కాలనీవాసుల వినతి



బల్దియా కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అమ్మనగర్ కాలనీవాసులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని అమ్మ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. ఈమేరకు మంగళవారం కాలనీవాసులు నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి తరలివచ్చి, కమిషనర్ దిలీప్‌కుమార్‌కు సమస్యలను విన్నవించి, వినతిపత్రం అందజేశారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ.. అమ్మనగర్‌లో గత 10 రోజులుగా స్ట్రీట్ లైట్లు వెలగడం లేదన్నారు. రాత్రివేళల్లో బయటకు వెళ్లాలంటే పాములు, తేళ్లు, విషపురుగుల భయంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. కాలనీ రోడ్లు గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. కాలనీ పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెంజర్ల నరేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, కాలనీవాసులు యెండల కిషన్, బొబ్బిలి కిషన్, మాడవేడి వినోద్‌కుమార్, యెండల మహేందర్, దగ్గుల మధుసూదన్, బత్తుల ప్రవీణ్ కుమార్, కత్రోజి రవి తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం



కీర్తనను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన తోట కీర్తన అనే విద్యార్థిని ధర్మారం ప్రభుత్వ కళాశాలలో చదివి ఇంటర్ బైపీసీ గ్రూప్‌లో 993/1000 మార్కులు సాధించింది. ఈసందర్భంగా మంగళవారం సదరు విద్యార్థినిని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఘనంగా సన్మానించి పారితోషకం అందించారు. నాయకులు మోత్కూరి నవీన్ గౌడ్, తోట ప్రకాష్, తోట కిషన్, పింబడి గంగాధర్ ఉన్నారు.

### ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం మంగళవారం రెండోరోజు కొనసాగింది. గెజిటెడ్ హెచ్‌ఎంలకు మోటివేషన్ కార్యక్రమం, వివిధ అంశాలను డాక్టర్ జలగం తిరుపతిరావు శిక్షణనిచ్చారు. అనంతరం డీఈవో అశోక్ మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని సూచించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణలో హెల్త్ అవేర్‌నెస్ సెషన్‌లో భాగంగా హెల్త్ ఎడ్యుకేటర్లు వెంకటేశ్వర్లు, స్వామి సులోచన అవగాహన కల్పించారు. షీ టీమ్ ఆక్టివిటీస్ గురించి షీ టీమ్ ఎస్సై స్రవంతి వివరించారు. డ్రగ్ నిరోధక చర్యలు, డ్రగ్స్ బానిసలు కాకుండా తీసుకునే చర్యల గురించి సైకియాట్రిక్ వివేక్ వివరించారు. శిక్షణలో 95మంది హెచ్‌ఎంలు, 201 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు సెంటర్ ఇన్‌చార్జి శంకర్ తెలిపారు.

## అక్షరాస్యత శాతం పెంచేందుకు 'సర్వే'

మోపాల్: రాష్ట్రంలో అక్షరాస్యత శాతం పెంచాలనే లక్ష్యంతో మహిళలకు చదవడం, రాయడం నేర్పించడం కోసం ఇందూరు అక్షర కిరణం సర్వే చేపడుతున్నామని ఐకేపీ ఏపీఎం మోహన్ తెలిపారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఆయన కార్యనిర్వాహకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్థిక అంశాలపై, ఇందూరు అక్షర కిరణంపై చర్చించారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ.. మండలంలోని 915 సంఘాల్లో 9150 మంది సభ్యులు ఉన్నారని, 29 గ్రామ సంఘాలు ఉన్నాయన్నారు. వారం రోజుల్లో ఇందూరు అక్షర కిరణం సర్వే పూర్తి చేయాలని సీసీలకు సూచించారు. సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలి విద్యార్హతల వివరాలు యాప్‌లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. ప్రతి మహిళకు చదవడం, రాయడం నేర్పిస్తారని, 10 మందికి ఒక వలంటీర్‌ను నియమిస్తామని తెలిపారు. వలంటీర్లు స్వచ్ఛందంగా పని చేయాల్సి ఉంటుందని, అందుకోసం అంగన్‌వాడీలు, ఆయాలు, సీసీలు, ఆసక్తి ఉన్న మహిళల ద్వారా కొనసాగిస్తామన్నారు. మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, గ్రామ సంఘాల అధ్యక్షులు, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం మోహన్

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 96,800 | వెండి(కిలో) | 1,01,500 |
| 22 క్యారెట్స్ | 89,355 | – నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు | డ్రెస్డ్ | 180 |
| | (కిలోకు) | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 200 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 12 | 24 | గాజరుగడ్డ | 30 | 60 |
| బెండకాయ | 30 | 50 | పచ్చిమిర్చి | 30 | 50 |
| బీరకాయ | 40 | 70 | దోసకాయ | 20 | 40 |
| దొండకాయ | 20 | 40 | ఆలుగడ్డ | 20 | 40 |
| జీర్నిసుకాయ | 150 | 200 | గోబిగడ్డ | 10 | 20 |
| కాకరకాయ | 30 | 50 | గోబిపువ్వు | 30 | 50 |
| వంకాయ | 30 | 60 | బీట్‌రూట్ | 30 | 50 |
| పాలకూర | 30 | 50 | కరివేపాకు | 40 | 60 |
| మెంతికూర | 50 | 80 | చామగడ్డ | 35 | 60 |
| కొత్తిమీర | 60 | 80 | గోరుచిక్కుడు | 40 | 60 |
| పుదీనా | 40 | 60 | చిక్కుడుకాయ | 40 | 60 |
| క్యాప్సికం | 50 | 90 | మామిడికాయ | 40 | 60 |

–సుభాష్‌నగర్

### సినిమాలు

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

- స్క్రీన్-1 ఏస్(తెలుగు)-1.30, 7.35
- మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.30, 10.30
- స్క్రీన్-2 ఒక బృందావనం(తెలుగు)-11.00
- నిశ్శబ్ద ప్రేమ(తెలుగు)-4.30
- సింగిల్(తెలుగు)-1.30, 7.30, 10.30
- స్క్రీన్-3 ఒక బృందావనం(తెలుగు)-4.30, 10.20
- లిలో అండ్ స్టిచ్(ఇంగ్లీష్ 3డీ)-1.30 , 7.30

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

- స్క్రీన్-1 మిషన్ ఇంపాజిబుల్ -10.10, .25, 10.40 సింగిల్(తెలుగు)-1.40, 7.55
- స్క్రీన్-2 లిలో అండ్ స్టిచ్(3డీ తెలుగు)-11.30,2.00
- ఏస్(తెలుగు)-4.30, 10.20
- ఒక బృందావనం(తెలుగు)-7.40
- స్క్రీన్-3 భూల్ చుక్ మాఫ్(హిందీ)-11.35, 8.00, 10.40
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-2.15
- హిట్(తెలుగు)-4.45
- స్క్రీన్ -4 వీరరాజా-1991(తెలుగు)-11.00
- వర్షం(తెలుగు)-1.40 –శుభం(తెలుగు)-7.30
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(ఇంగ్లీష్)-5.00, 10.10
- లలితామహల్ యమదొంగ దేవి సింగిల్
- నటరాజ్ మిషన్ ఇంపాజిబుల్ విజయ్ హిట్